వర్షపు నీరు వృథా

ఏటికాలువ ఆధునికీకరణ చేయకపోవడంతో సముద్రం పాలు

- దశాబ్దాలుగా పట్టించుకోని అధికారులు
- కాలువ మొత్తం జమ్ము, తూటాకుతో నిండిన పూడిక
- పలు చోట్ల కాలువ కట్ట బలహీనం
- 10 వేల ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపంగా పరిణమించింది. ఆత్మకూరు మేజర్ చెరువుకు ప్రధాన నీటి పారుదల వనరు ఏటి కాలువ. ఇంతటి ప్రాధాన్యమైన ఏటి కాలువ దశాబ్దాలుగా పూడిక తీతకు, ఆధునికీకరణకు నోచుకోలేదు. ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరద నీరంతా పెన్నానది ద్వారా సముద్రం పాలైంది.

ఆత్మకూరు: ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని, నీటిని వృథా చేయొద్దని హితోక్తులు చెబుతున్న జలవనరుల శాఖ అలవికాని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఎదురైన నేపథ్యంలో అదృష్టం కొద్ది వర్షాలు పడితే ప్రతి నీటి బొట్టును నిలబెట్టుకునేందుకు ఆ శాఖాధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోలేదు. ఆత్మకూరు మేజర్ చెరువు కేవలం వర్షాధారం, బొగ్గేరు వరద నీటితో నిండుతుండేది. సోమశిల జలాశయం నుంచి నీరు విడుదల అవుతున్నప్పటి నుంచి ఉత్తర కాలువ ద్వారా చీలుకాలువ ఏర్పాటు చేసి చెరువుకు నీరు సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా బొగ్గేరు, కొండవాగు నీటితోనే చెరువు దశాబ్దాల తరబడి నిండుతుండేది. ఈ రెండు ప్రధాన వనరుల నుంచి చెరువుకు ఏటికాలువ ద్వారా నీరు రావడం పరిపాటి. 1977 సంవత్సరంలో గొల్లపల్లి వద్ద నిర్మించిన సైఫన్ ద్వారా ఏటికాలువను ఆధునికీకరించి బొగ్గేరు, కొండవాగు నీరు చెరువుకు వెళ్లేలా అప్పట్లో చర్యలు చేపట్టారు. అప్పుడప్పుడు ఏటికాలువకు రైతులే చందాలు వేసుకుని మరమ్మతులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఏడు కిలో మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు ఉన్న ఏటికాలువ పలు చోట్ల (బోయలచిరివెళ్ల, నారంపేట) దెబ్బతింది. దీనికి తోడు పూడిక చేరి జమ్ము, తూటాకు ఏటికాలువలో విపరీతంగా పెరగడంతో సజావుగా నీరు చెరువుకు అందని పరిస్థితి నెలకొంది. గత నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు బొగ్గేరు, కొండవాగు ఉధృతంగా


ఆత్మకూరు చెరువుకు నీరు సరఫరా చేసే ఏటికాలువ

ప్రవహించినా ఏటికాలువ సక్రమంగా లేకపోవడంతో ఆత్మకూరు చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరక విలువ జలాలు వృథాగా పెన్నానదిలో కలిశాయి. అధికారికంగా సుమారు 6,500 ఎకరాల పారుదల, అనధికారికంగా మరో 3,700 ఎకరాల పారుదల కలిగి ఉన్న ఆత్మకూరు చెరువుకు ఇక సోమశిల జలాలే ఆధారం. సోమశిల జలాలు డెల్టా ప్రాంతానికి ముందుగా వదిలి నెల రోజుల అనంతరం ఆత్మకూరు వంటి మెట్ట ప్రాంతాలకు విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే నార్లు పోసి, మరి కొందరు వరి నాట్లు వేసి ఉన్నారు. పూర్తిస్థాయిలో నీరు చెరువుకు చేరితే గానీ రైతులు పంటలు పండించుకోలేని పరిస్థితి. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి బొగ్గేరు, కొండవాగు నీటితో పాటు సోమశిల జలాలు చెరువుకు సరఫరా చేసే ఏటికాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని రైతులు


నారంపేట వద్ద నిర్మించిన సైఫన్

కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఈఈ వెంకటేశ్వర్లును సంప్రదించగా ప్రభుత్వానికి నివేదిక పంపామని, నిధులు మంజూరైన వెంటనే తొలుత ఏటికాలువ మరమ్మతు పనులు చేయించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

వాగు ఆక్రమణలు పరిశీలన


వాగు పోరంబోకు భూముల్లో గ్రావెల్ తోలిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని చేనేత కాలనీ వెనుక వైపు ఉన్న వాగు పోరంబోకు స్థలాలను పలువురు ఆక్రమించి కంచె వేశారు. రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ తోలారు. ఈ విషయమై పలువురు ఆర్డీఓ కె మధులతకు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆమె ఇరిగేషన్ అధికారులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ స్థానికులు ఆక్రమించిన స్థలాలను పరిశీలించారు. ఆర్డీఓకు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఏఈ ఎస్కే బాషా తెలిపారు.

మిరప పంట పరిశీలన


మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోమశిల: మండలంలోని బొమ్మవరం అగ్రహారం రైతు భరోసా కేంద్రం పరిధిలోని తొలిజాపురంలో సాగులో ఉన్న మిరప పంటను ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ, శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్, ఆత్మకూరు ఏడీఏ వి.దేవసేనమ్మ పరిశీలించారు. తోటలో నీరు బాగా నిలబడిన ప్రదేశాల్లో మొక్కలు చనిపోతాయని, డ్రైనేజ్ సౌకర్యం ఉన్న పొలాల్లోనే పంటలు వేయాలన్నారు. నీళ్లు వెంటనే బయటకు వెళ్లేలా దారులు ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఓ శ్రీధర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు లక్ష్మీదేవి, వీఏఏలు రమ్య, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత


సరుకులు, నగదు అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్

ఆత్మకూరు: పట్టణంలోని హిల్ రోడ్డు 18వ వార్డు గిరిజనకాలనీలో అనారోగ్యంతో పూర్తిగా మంచానికే పరిమితమైన నాగమల్లేశ్వరి కుటుంబానికి డాక్టర్ జే ప్రణీత్ నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. నాగమల్లేశ్వరి ఏడాది కాలంగా మెదడు సంబంధిత అనారోగ్యానికి గురై శరీర అవయవాలు పనిచేయక మంచానికే పరిమితమైంది. దీంతో ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆమె పరిస్థితి తెలుసుకున్న డాక్టర్ జే ప్రణీత్ ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ తన వంతు సహాయం అందజేస్తానన్నారు. వార్డు కౌన్సిలర్ గంధళ్ల వేణు, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపీ

సంగం: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా చేస్తున్నామని ఎంపీడీఓ గోపీ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో 2 వేల రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. వలంటీర్లతో డోర్ టూ డోర్ తిరిగి సర్వే చేయిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సచివాలయంలో కాని, 1902 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 15 నుంచి జరగబోయే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాచిన నీటిని తాగాలి


ఇంటి వద్ద వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్

చేజర్ల: తుఫాన్ కారణంగా వాతావరణంలో మార్పు వచ్చిందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని డాక్టర్ పవన్ సూచించారు. మండలంలోని వావిలేరు స్కూల్లో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. సుమారు 70 మంది రోగులను చూశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చిన్నయ్య, ఎంఎల్‌హెచ్‌పీ టి.ఉమామహేశ్వరి, విమలకుమారి, రఫీ సరకమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం


అల్లూరు: ప్రభుత్వ సాయాన్ని అందజేస్తున్న తహసీల్దార్, నాయకులు


జలదంకి : ఎస్టీ కాలనీలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దార్

అల్లూరు: తుఫాన్ ప్రభావంగా ఇబ్బందులు పడి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసం కేంద్రాల్లో తలదాచుకున్న బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులతో పాటు రూ.2,500 ఆర్థిక సాయాన్ని శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్ అందజేశారు. మండలంలోని 50 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ నూనె, కేజీ కందిపప్పు, కేజీ ఉల్లిపాయలు, కేజీ ఉల్లగడ్డలతో పాటు నగదు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో విపత్తు, తుఫాన్ సమయాల్లో బాధితులకు అండగా నిలిచిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విపత్తులు, తుఫాన్ల సమయాల్లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వారికి పునరావాస కేంద్రాల్లో ఉన్నన్ని రోజులు మూడు పూటల భోజన సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఇంటికి వెళ్లేటప్పుడు నిత్యాసవరాలతో పాటు నగదు సాయాన్ని అందజేస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్, నాయకులు భక్తవత్సలరెడ్డి, నిమ్మల భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

జలదంకి: జలదంకి ఎస్టీ కాలనీలో శుక్రవారం తుఫాన్ బాధితులకు తహసీల్దార్ ఏవీ రమణారావు నిత్యావసర సరుకులు అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో జలదంకి, బ్రాహ్మణక్రాక ఎస్టీ కాలనీ ప్రజలను తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టామన్నారు. వారికి ప్రభుత్వం తరఫున బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు రూ.2,500 నగదును అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చెన్నకృష్ణయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఒకే వ్యక్తికి ఒకే చోట ఓటు ఉండాలి


బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

సంగం: ఒక వ్యక్తికి ఒకే చోట ఉండాలని, కొత్తగా నమోదు చేసే ఓటర్లపై ఎక్కడా ఓటు లేదనే డిక్లరేషన్ తీసుకోవాలని తహసీల్దారు నాగరాజు బీఎల్‌ఓలను ఆదేశించారు. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శుక్రవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఫొటో గ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీ ఓటర్స్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఒకే ఫొటో ఇద్దరు వ్యక్తులకు ఉంటే వాటి సవరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒకే వ్యక్తికి వేరే వేరే ప్రాంతాల్లో రెండు ఓట్లు ఉండటాన్ని గుర్తించి ఒకే ప్రాంతంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

నేడు ఓటరు నమోదుకు చివరి అవకాశం

సోమశిల: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేర్పులు, మార్పులకు శనివారం రోజు ఆఖరి అవకాశమని అనంతసాగరం మండల రెవెన్యూ అధికారులు తెలిపారు. 18 ఏళ్ల నిండిన యువతి యువకులు ఓటు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జనవరిలో ఓటర్ల జాబితా విడుదలవుతుందని తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడా ఉపకరణాల అందజేత


క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎంపీపీ తూమాటి

చేజర్ల: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో క్రీడా ఉపకరణాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ ఎస్కే కరిముల్లా, ఏపీఎం సుజీవన, ఈఓపీఆర్డీ రామయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ బషీర్, నాయకులు మాలపాటి పెంచలరెడ్డి, ఆనంద్ రెడ్డి, రసూల్, బాలయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రౌండ్ చదును

ఆత్మకూరు: ఇటీవల కురిసిన తుఫాన్ వర్షాలకు పట్టణంలోని ప్రభుత్వ వెస్ట్ పాఠశాలలో పలు చెట్లు పాఠశాల భవనంపైన, ప్రహరీ గోడలపైన కూలాయి. దీనికి తోడు ఆవరణ సైతం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో 16వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముజీబ్ తన సొంత ఖర్చులతో రెండు రోజులుగా పాఠశాలలో క్లీనింగ్ పనులు చేయిస్తున్నారు. పడిపోయిన చెట్లను తొలగించడం, పాఠశాలలో పరిశుభ్రం చేయించి గ్రావెల్ తోలి చదును చేయించారు. పడిపోయిన ప్రహరీ గోడను సైతం నిర్మిస్తున్నారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఎంఈఓ నజీర్‌బాషా పాఠశాలను సందర్శించి ముజీబ్‌ను అభినందించారు.


గ్రావెల్ తోలి చదును చేయిస్తున్న దృశ్యం

వైభవంగా అయ్యప్పస్వాముల శోభాయాత్ర


శబరిమల తరలివెళుతున్న అయ్యప్ప స్వాముల శోభాయాత్ర

కలిగిరి: అయ్యప్పమాలధారణ స్వాములు శుక్రవారం శబరిమలకు శోభాయాత్రగా తరలివెళ్లారు. కలిగిరిలోని పార్వతి సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో గురుస్వాములు ఇరుముడులు కట్టారు. పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వాములు శోభాయాత్రగా ఆర్అండ్‌బీ బంగ్లా వద్దకు చేరుకున్నారు. బంధుమిత్రులు చేరుకుని అయ్యప్పలను శబరిమలకు సాగనంపారు. పట్టణం అయ్యప్ప భక్తులతో కిటకిటలాడింది.

హెల్పర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలిగిరి: మండలంలోని రాజుపాళెం (ఓసీ), వీర్నకొల్లు (ఓసీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకులు (హెల్పర్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వింజమూరు సీడీపీఓ సీహెచ్ పద్మజాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదంకి మండలం ఆదిరెడ్డిపాళెం మెయిన్ (ఓసీ), తిమ్మసముద్రం (ఎస్సీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. 8వ తరగతి పూర్తి చేసిన 21 నుంచి 35 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. అర్హులైన ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

చేజర్ల: మండలంలోని పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణలో అధికారులు పరిపాలనా విధానాన్ని వివరించారు. రికార్డుల నిర్వహణ, ఆదాయం, వ్యయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్కే కరిముల్లా, ఈఓపీఆర్డీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు


రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న వైద్యాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ ఉషాసుందరి, సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం


చేజర్ల: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ


సోమశిల: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ బాలకృష్ణారెడ్డి


దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న అధికారులు

చేజర్ల: దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి ప్రత్యేకావసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తుందని ఎంఈఓ కళాధర్ తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని శుక్రవారం చేజర్ల ఎంపీపీఎస్ మెయిన్ భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ డిసెంబర్ 3న దివ్యాంగుల దినోత్సవం కాగా తుఫాన్ కారణంగా వాయిదా వేశామన్నారు. దివ్యాంగుల అవసరాలను ప్రభుత్వం తీరుస్తుందన్నారు. ఇక్కడికి వచ్చిన తల్లిదండ్రులకు ప్రభుత్వమిచ్చే సదుపాయాలను ఉపయోగించుకోవాల్సిందిగా తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 డీసీ మస్తానయ్య, జెడ్పీహెచ్ ఇన్‌చార్జి హెచ్‌ఎం బీఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో..

సోమశిల: అనంతసాగరం భవిత కేంద్రంలో శుక్రవారం ఎంఈఓ-1 ఎం.బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగులను తక్కువగా చూడొద్దని, మానసికంగా దృఢత్వం కలిగి ఉంటారన్నారు. భారత ప్రభుత్వం దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా రిజర్వేషన్లు ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత కల్పించిందన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలను నిర్వహించి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌డీ నరసింహ, బాలభారతి, ప్రధానోపాధ్యాయులు మహబూబ్ బాషా, సీఆర్‌పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో..

అల్లూరు: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని మండల స్పెషల్ ఆఫీసర్ మృదుల, ఎంపీడీఓ జ్యోతి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. దివ్యాంగులపై సానుభూతిని కనబరచడం కంటే వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర, సహిత ఉపాధ్యాయురాలు జే సునీత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కేఎస్సార్ ఫౌండేషన్ నిర్వాహకులు భవిత కేంద్రంలోని పిల్లలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

రూ.20 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

- అందుకే 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి'


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు

మర్రిపాడు: మండలంలోని సింగనపల్లి సచివాలయం పరిధిలో ప్రజలకు గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.20 కోట్ల మేర సంక్షేమాన్ని, అభివృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని, అందుకే అందుకే 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అని వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు అన్నారు. శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు నిర్వహించారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గంగవరపు శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే దిక్సూచీ అన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రతి సచివాలయానికి అదనంగా మరో రూ.20 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారన్నారు. పొగాకు, బొప్పాయి, మిరప పంటలకు ఈ రోజు అత్యంత మద్దతు ధర లభించిందని, దానికి కారణం ముఖ్యమంత్రేనని అన్నారు. ఆరోగ్యశ్రీ ఎక్కడా లేదని, ఆ కార్డు పరిమితిని ఏకంగా రూ.25 లక్షలు చేసిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. శుక్రవారంతో మండలంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం పూర్తయింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాచాల గీత ఎంపీటీసీ కుంటా సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ కన్వీనర్ రేవూరు వేణుగోపాల్ రెడ్డి, చెవుల శ్రీనివాసులు, ఓంకారం శివ, కాశిరెడ్డి, నాగరాజు, జనార్దన్, బాలు, అయ్యవారయ్య, ఈశ్వరయ్య, రసూల్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన


అన్నవరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సింగయ్య


మర్రిపాడు:ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న దృశ్యం

జలదంకి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. మండలంలోని అన్నవరం, గట్టుపల్లి గ్రామాల్లో శుక్రవారం సంకల్పయాత్ర నిర్వహించారు. అనంతరం ఆరోగ్య శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్యం అందించారు. అర్హులైన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేపట్టారు. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, ఏఓ శైలజ, హౌసింగ్ ఏఈ ప్రసాద్, బీజేపీ నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ, నాయకులు దామెర్ల దేవదాస్, గుమ్మడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యం

మర్రిపాడు: మండలంలోని ఏపిలగుంట, చిన్నమాచనూరు, పోలిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి కేంద్ర ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న ఉజ్వల గ్యాస్ సిలిండర్లను అందజేశారు. దేశంలో అందరి సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, బీజేపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు.

అతి పెద్ద విద్యార్థి యూనియన్ ఎస్ఎఫ్ఐ

- పట్టణ మహాసభలు నూతన కమిటీ ఎన్నిక



ఎస్ఎఫ్ఐ మహాసభల ర్యాలీ ప్రారంభిస్తున్న విద్యార్థి సంఘ నేతలు

ఆత్మకూరు: దేశంలోనే అతి పెద్ద విద్యార్థి యూనియన్ ఎస్ఎఫ్ఐ అని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో విశేష కృషి చేసిందని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణ ఎస్ఎఫ్ఐ మహాసభలు శుక్రవారం నిర్వహించారు. తొలుత మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి మహాసభ నిర్వహించే చెర్లో రమణారెడ్డి భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహాసభలో 22 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా చక్రీ, అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, కార్యవర్గ సభ్యులుగా ప్రతాప్, నాని, బాలాజీ, భరణి, శ్రీను, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి, గద్దర్‌బాబు, సందానీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి

కలిగిరి: కలిగిరి పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య ప్రణాళిక చేపట్టినట్లు సర్పంచ్ రాగి దివ్య తెలిపారు. కలిగిరి గ్రామ సచివాలయంలో పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తుఫాన్ సమయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులు, గ్రామస్తుల సహకారంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, అశోక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.